క్లుప్తంగా

నాలా పనుల పరిశీలన



ప్రేమ్‌నగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: డివిజన్‌లో నాలాల సమగ్ర అభివృద్ధికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం డివిజన్‌లో నాలాల అభివృద్ధి పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. డివిజన్‌లోని ప్రజలకు వర్షాకాలంలో గత కొన్నేళ్లుగా నాలాలతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

గోశాల కేలండర్ ఆవిష్కరణ

కాచిగూడ: తెలంగాణ గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కేలండర్‌ను ఎమ్మెల్యే రాజాసింగ్ ఆవిష్కరించారు. గోవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్‌అగర్వాల్, అధ్యక్షుడు రాజేశ్వర్ రావు, దుర్గంరోజా, ఎల్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల స్వరార్చన



చిక్కడపల్లి: త్యాగరాయగానసభలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ అర్చన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘంటసాల శతజయంతి సందర్భంగా స్వరార్చన కార్యక్రమం అలరించింది. మంగళవారం అర్చన వెంకటేశ్వరరావు సారథ్యంలో అఖిల, లలిత, లలితారావు, డాక్టర్ టి.వీరావు, శేఖరుడు, నాగరాజు తదితరులు పాడిన పలు పాటలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు శ్యామకృష్ణను ఘంటసాల సంగీత పురస్కారంతో సత్కరించారు.

భారతీయ సంప్రదాయాల ప్రచారానికి కృషి



చిక్కడపల్లి: భారతీయ సంస్కృతి సంప్రదాయాల ప్రచారానికి కృషి చేస్తున్నట్లు ఓంకార సత్సంగ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజయోగి చిక్కా దేవదాసు అన్నారు. జార్ఖండ్ రాష్ట్రం సత్సంగ సభ్యుల ఆహ్వానం మేరకు 11 రోజుల పాటు సత్సంగ సభ్యులతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక పర్యటన నిర్వహించారు. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన వైద్యనాథున్ని దర్శించి కట్‌బంధన్, అభిషేకం, హారతి పూజలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు.

వినతిపత్రం అందజేత



చిక్కడపల్లి: రూ.లక్ష మోటార్ సైకిళ్లను భవన నిర్మాణ కార్మికులకు వెంటనే అందించాలని భవన నిర్మాణ కార్మికులు మంత్రి మల్లారెడ్డి ఇంటివద్ద ఆయనకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న వేలాది క్లెయిమ్స్‌కు నిధులు కేటాయించి వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలన్నారు. భవన నిర్మాణ, ఇతర నిర్మాణ ఫెడరేషన్ ప్రతినిధులు రాములు, ఆర్.కె.రాజు పాల్గొన్నారు.

కంటి వెలుగుకు స్పందన

అడ్డగుట్ట: కంటి వెలుగుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయి శంకర్ తెలిపారు. మంగళవారం ఆయన ఆయన బోయబస్తీ, బీజేఆర్‌లోని కంటి వెలుగు కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అద్దాల పంపిణీ, కంటి ఆపరేషన్ల కోసం ఆస్పత్రులకు రిఫర్ చేయడంతో పాటు ఇతర కంటి సమస్యలు ఉన్న వారికి మందులు, మాత్రలు కూడా అందజేస్తున్నట్లు వెల్లడించారు. బీజేఆర్ కమ్యూనిటీహాల్లో 100 మందికి పరీక్షలు చేయగా 47 మందికి అద్దాలు ఇచ్చామని, 8 మందిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు చెప్పారు. అదే విధంగా బోయబస్తీలోని కేంద్రంలో 76 మందికి పరీక్షలు నిర్వహించి 13 మందికి అద్దాలు, 15 మందిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు వెల్లడించారు.

జూనియర్ కళాశాలలకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం టీపీజేఎంఏ సమావేశంలో మాట్లాడుతున్న గౌరీ సతీష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో ప్రైవేటు జూనియర్ కళాశాలలకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రైవేటు జూనియర్ కాలేజీ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (టీపీజేఎంఏ) రాష్ట్ర అధ్యక్షులు గౌరీ సతీష్ విజ్ఞప్తి చేశారు. సేవా దృక్పథంతో విద్యాసంస్థలను నడిపిస్తున్న జూనియర్ కళాశాలలకు జీఎస్టీ విధించడం సరికాదన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీజేఎంఏ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు జూనియర్ కళాశాలలకు అనుబంధ గుర్తింపును ఏడాదికే పరిమితం చేయడం సరికాదన్నారు.

- కళాశాలల ట్రేడ్ లైసెన్స్‌ను మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పెంచాలని విద్యాలయాలకు ట్రేడ్ లైసెన్స్‌ను అడుగుతున్నారని వ్యాపార దృక్పథంతో విద్యా సంస్థలను నడిపించడం లేదన్నారు.
- జూనియర్ విద్యా కళాశాలలకు ట్రేడ్ లైసెన్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రైవేటు జూనియర్ కళాశాలలకు పరిమిత ఫీజులను ప్రభుత్వమే విధించాలని ఆయన కోరారు. టీపీజేఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, అధికార ప్రతినిధి శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్, కోశాధికారి శ్రీనివాస్‌చౌదరి, రాష్ట్ర నాయకులు వీరారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పార్థసారధి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న బేగంపేట్ ట్రాఫిక్ పీఎస్ ఎస్సై జ్యోతి

చిక్కడపల్లి: ట్రాఫిక్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బేగంపేట ట్రాఫిక్ పీఎస్ ఎస్సై సీహెచ్. జ్యోతి అన్నారు. జవహర్‌నగర్‌లోని గీతాంజలి హైస్కూల్‌లో మంగళవారం పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎస్సై జ్యోతి మాట్లాడారు. - విద్యార్థులు ట్రాఫిక్‌పై అవగాహన పెంచుకోవడం వల్ల వారికి భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుందన్నారు.

- ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండడం వల్ల ప్రమాదాల నివారణ , రోడ్లపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తమ వంతుగా పిల్లలు తెలుసుకుంటారన్నారు.
- అనవసరంగా రోడ్లపైకి వాహనాలు తీసుకొచ్చి ట్రాఫిక్ ఇబ్బందులకు కారణం కావొద్దని పిల్లలకు సూచించారు.
- విద్యార్థులు 18 ఏళ్లు వచ్చేవరకు వాహనాలను నడిపించవద్దని సూచించారు. విద్యార్థులు కూడా కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ నియంత్రణలో తమ వంతు బాధ్యత నిర్వహించాలన్నారు. 110 మంది విద్యార్థులు, పాఠశాల ప్రిన్సిపాల్ శాంత, స్టాఫ్ చక్రధర్, నాగరాజు, పరిపాలన విభాగాధికారి ఎం.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలపై కేంద్రానిది కక్షపూరిత వైఖరి'

కవాడిగూడ: ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలపై కేంద్రం కక్షపూరిత వైఖరిని ప్రదర్శిస్తోందని ఆ పార్టీ అధినేత ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఇతర నేతలపై ఈడీ, అక్రమ కేసులు పెట్టి కుట్రలు చేస్తోందని ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోర్‌కమిటీ సభ్యులు డాక్టర్ సుధాకర్ ఆరోపించారు. ఈడీ, సీబీఐ సంస్థలను పావుగా వాడుకుంటూ ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత వైఖరిని నిరసిస్తూ పార్టీ నేతలు మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ఆమ్‌ఆద్మీ పార్టీశాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దేశంలో ప్రజాస్వామ్యం పరిరక్షణకు ఆమ్‌ఆద్మీ పార్టీ కేంద్ర శాఖ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా ఈడీ చార్జీషీట్‌లను తగులబెట్టే కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్‌కమిటీ సభ్యులు రాముగౌడ్, నగర కన్వీనర్ మహ్మద్ మాజీద్, నాయకులు గఫార్, మహిళా నాయకురాలు అఫ్సా, రమేష్, శ్రీనివాస్, పరిక్షిన్ పవాన్, పురుషోత్తం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ స్వీపర్లను పర్మనెంట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గాలిపల్లి కృష్ణ

కాచిగూడ: మున్సిపల్‌లో గత 20 ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్ స్వీపర్, కామటీలుగా పనిచేస్తున్న వారిని వెంటనే పర్మనెంట్ చేయాలని తెలంగాణ మున్సిపల్ స్వీపర్ అండ్ కామాటీ వెల్ఫేర్ సొసైటీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గాలిపల్లి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందిర, ప్రధానకార్యదర్శి మల్లేష్, రేణుకా, బాబులతో కలిసి మాట్లాడారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి హెల్త్ కార్డులను ఇవ్వాలని, కార్మికుడు మరణిస్తే వారి ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, చనిపోయిన కార్మికుడి కుటుంబానికి రూ.5లక్షల బీమా కల్పించి కార్మిక చట్టాలను వర్తింప చేయాలన్నారు.

- ఔట్‌సోర్సింగ్ కార్మికులకు బ్యాంక్ అకౌంట్‌ను ప్రారంభింపజేయాలని ఔట్‌సోర్సింగ్ గ్రూపులలో సిబ్బంది ఉండేలా చూడాలన్నారు.
- విధులకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకుని వారి జీతాన్ని ప్రభుత్వానికి రిటర్న్ చేయాలన్నారు. కార్మికుల వేతనంలో ప్రతినెల రూ.700 నుంచి రూ.1000 వరకు కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
- ఈ విధానాన్ని వెంటనే నిలిపివేయాలని కార్మికులు చనిపోతే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రభుత్వం తరఫున దహన సంస్కారాలకు రూ.15 వేలు ఇవ్వాలన్నారు.
- మహిళా స్వీపర్స్‌పై లైంగిక వేధింపులు ఆపాలని ఎవరైనా వేధింపులకు పాల్పడితే వారిని చట్టపరంగా శిక్షించాలన్నారు. - కార్మికులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని కార్మికుల సమస్యలపై మున్సిపల్ మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు ప్రకటించారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఉన్నతాధికారులకు అందజేశామన్నారు.

సెల్‌ఫోన్ చోరీ.. కేసు నమోదు

కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

కాచిగూడ: సెల్‌ఫోన్ చోరీపై కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఓ బాధితుడు ఫిర్యాదు చేశాడు. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. చంచల్‌గూడ ప్రాంతానికి చెందిన ఎండీ బషీరుద్దీన్ ఈ నెల 5న డబీర్‌పురా నుంచి హఫీజ్‌పేట్‌కు ఎంఎంటీఎస్ రైలులో వెళ్తుండగా అతడి సెల్‌ఫోన్ చోరీకి గురైంది. కాగా బాధితుడి ఫిర్యాదుతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

జీరో ఎఫ్ఐఆర్..

కాచిగూడ: సెల్‌ఫోన్ చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. తిరువనంతపురానికి చెందిన డేవిడ్ సోమవారం చెన్నై నుంచి చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వస్తున్నాడు. రైలు కడప వద్దకు రాగానే అతడి సెల్‌ఫోన్ చోరీకి గురైంది. మంగళవారం బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ నిమిత్తం కేసును కడప రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

అర్చకుల సంక్షేమానికి రమణాచారి కృషి



రమణాచారిని కలిసిన జేఏసీ నాయకులు

సుల్తాన్‌బజార్: అర్చక ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ. రమణాచారి ఎంతో కృషి చేస్తున్నారని అర్చక జేఏసీ కన్వీనర్ పరశురామ్ రవీంద్రచార్యులు కందూరి కృష్ణమాచార్యులు అన్నారు. ఈ మేరకు కేవీ.రమణాచారి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సంస్కృతి సంప్రదాయాన్ని గౌరవిస్తూ దేవాదాయ శాఖలో కమిషనర్‌గా ఉన్నప్పుడు రమణాచారి ఆలయాల్లో ప్రవచనాలు, హరికథ కాలాక్షేపం నిర్వహించారని గుర్తుచేశారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుంటూ జేఏసీ తరఫున దేవాదాయ శాఖ ప్రతి ఆలయ కార్యనిర్వహణ అధికారులకు సర్క్యులర్ అందేవిధంగా కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తామని తెలిపారు. అదేవిధంగా దేవాదాయశాఖ అధికారులను, కార్యనిర్వహణ అధికారులను అర్చక ఉద్యోగుల సంఘాలన్ని ధార్మిక సంస్థ అయిన దేవాదాయశాఖ ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగేలా సహకరించాలని అధికారులను కోరారు. బండ్దారి జగపతి, అగ్నిహోత్ర చంద్రశేఖర శర్మ పాల్గొన్నారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పేదలకు ఎంతో లబ్ధిచేకూరుస్తున్నాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. షాదీముబారక్ పథకం క్రింద అంబర్‌పేట మండల పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన 74 చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పేదింటి ఆడపిల్ల వివాహానికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో అండగా నిలుస్తున్నాయన్నారు. తహసీల్దార్ లలిత, రెవెన్యూ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అభినందన



విద్యార్థులతో సామురాయ్ కరాటే అకాడమీ డైరెక్టర్

కాచిగూడ: రుద్రమదేవి షోటోఖాన్ కరాటే అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ నేషనల్ ఓపెన్ కరాటే అండ్ కుంగ్ఫూ పోటీల్లో నారాయణగూడలోని సామురాయ్ ప్రొఫెషనల్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు పాల్గొని 14 మెడల్స్ సాధించారన్నారు. అకాడమీ డైరెక్టర్ సిద్ధార్థ్ షా తెలిపారు. 8 మంది విద్యార్థులకు పసిడి, నలుగురికి రజతం, ఇద్దరు కాంస్య పతకాలను సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం అకాడమీలో సిద్ధార్థ్‌షా అభినందించారు.

ప్రొటోకాల్ పాటించడంలో అధికారుల నిర్లక్ష్యం



కార్పొరేటర్ దూసరి లావణ్య

అంబర్‌పేట: గోల్నాక డివిజన్‌లో అధికారులు ప్రొటోకాల్‌ను పాటించడం లేదని డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్‌లో చేపట్టే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు సమాచారం ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. ప్రజల కోసం చేపట్టే అభివృద్ధి పనులపై కనీస సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. డివిజన్‌లోని శాంతినగర్‌లో మంగళవారం డ్రైనేజీ పైప్‌లైన్ పనుల ప్రారంభోత్సవానికి జలమండలి అధికారి కనీసం సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ మహిళా ప్రజా ప్రతినిధిగా తనకు అధికారులు సమన్వయం, స్పందించే తీరు అధ్వానంగా ఉందని విషయాలపై పలు సార్లు చెప్పినా అధికారుల తీరు మార్చుకోకపోవడంపై మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని కార్పొరేటర్ హెచ్చరించారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు



అంబర్‌పేట: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీ చైతన్య కళాశాల డీడీ కాలనీశాఖ విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం వెలువడిన జేఈఈ మేయిన్స్ మొదటి విడత ఫలితాల్లో విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలను దీంతో కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. కళాశాల డీన్ శ్రీనివాస్‌రెడ్డి ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఏజీఎంలు సతీష్, అంకిరెడ్డి, ప్రిన్సిపాల్ యోగానంద్, అధ్యాపకులు ఉదయ్‌కిరణ్, మణికంఠ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్‌ను రద్దు చేయాలి

ముషీరాబాద్: రంగారెడ్డి జిల్లా బీసీ అభివృద్ధి శాఖ నుంచి సీనియర్ అసిస్టెంట్‌ను మేడ్చల్ జిల్లా బీసీ అభివృద్ధి శాఖకు డిప్యూటేషన్‌పై పంపించడంతో జిల్లాలో సిబ్బంది కొరత ఏర్పడిందని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్ అన్నారు. ఆయన డిప్యూటేషన్‌ను రద్దు చేసి జిల్లాలోనే కొనసాగించాలన్నారు. రంగారెడ్డి జిల్లా ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లు జూనియర్ అసిస్టెంట్‌లు చేయకుండా సీనియర్ అసిస్టెంట్‌లకు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ బీసీ సంక్షేమ శాఖకు వినతిపత్రాన్ని అందజేశారు.

మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

కవాడిగూడ: మిషన్ భగీరథ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలకు ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. దీనికోసం కార్మికులంతా ఐకమత్యంగా ఉద్యమించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. మిషన్ భగీరథ కార్మికులకు ప్రభుత్వమే నేరుగా వేతనాలు ఇవ్వాలని జీవో నెంబర్ 11ను అమలు చేయాలన్నారు.

- ఈఎస్ఐ 8 గంటల పనివిధానం, ఇన్సూరెన్స్, అమలు చేసి లైన్‌మెన్‌లకు టీఏలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇందిరాపార్కు వద్ద మిషన్‌భగీరథ కార్మిక సంఘాల జేఏసీ (సీఐటీయూ, టీఆర్ఎస్‌కేవీ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ) సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి హాజరై మాట్లాడారు.
- మిషన్ భగీరథ పథకానికి అవార్డులు, రివార్డులు, కితాబులు వస్తున్నాయని, దీనికోసం కార్మికులు అహర్నిశలు కష్టపడినా వారికి కష్టాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యథేచ్ఛగా ఏజేన్సీలు కార్మికుల పొట్టకొట్టి నిలువు దోపిడి చేస్తున్నారని ఆరోపించారు.
- రాష్ట్ర ప్రభుత్వం కంపెనీలకు ఇచ్చే ఎస్ఎస్ఆర్ రేట్లు రూ.18 వేలకు పైగా చూపిస్తున్నప్పటికీ కార్మికులకు మాత్రం కేవలం రూ. 8500 నుంచి రూ.12 వేలలోపు చెల్లించడం దురదృష్టకరమన్నారు.
- ప్రభుత్వం ఏజెన్సీలకు చెల్లించిన ఎస్ఎస్ఆర్ రేట్లలో 50 శాతం కూడా కార్మికులకు దక్కడం లేదన్నారు. ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొచ్చేందుకు అహర్నిశలు పాటుపడుతున్న మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించాలన్నారు. జేఏసీ నేతలు పొలడుగు భాస్కర్, రాంబాబు, నర్సింహ్మా, సూర్యం, కార్మిక సంఘాల నేతలు శ్రీనివాస్, రాములు, సీహెచ్ రాములు, వెంకటయ్య, సుదర్శన్‌గౌడ్, నర్సింహ్మారెడ్డి, వెంకటేష్, రవి, బాబురావు, చంద్రయ్య, రాము, ఆంజనేయులు, ఎస్.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో విద్యా రంగానికి మొండిచేయి'



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్

ముషీరాబాద్: బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి చూపించి విద్యార్థులను, నిరుద్యోగులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌లు విమర్శించారు. మంగళవారం విద్యానగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 19,093 కోట్ల రూపాయలు కేటాయించడం అన్యాయమని ఇది కేవలం ఉద్యోగుల జీతబత్యాలకే సరిపోతుందన్నారు. బడ్జెట్ అంటే వర్తమానంలో ఉన్న సమస్యలను అధిగమిస్తు భవిష్యత్తు నిర్మించే విధంగా ఉండాలన్నారు. రాష్ట్ర సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్ విద్యారంగంలో ఇప్పుడు ఉన్న సమస్యలనే తీర్చే విధంగా లేవన్నారు. ఐదు వేల కోట్ల ఫీజురియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బాకీ పడి ఉందని ఇవి సకాలంలో అందించే పరిస్థితి లేదన్నారు. ఇక ప్రభుత్వ స్కూల్స్, కాలేజీలు, యూనివర్సిటీలు, సమస్యలతో సతమతమవుతున్నాయని నిధుల లేమితో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవన్నారు. విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, విద్యానాథ్, మహేష్, రాకేష్, సందీప్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి నిరోధక బడ్జెట్

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రగతిశీల బడ్జెట్ కాదని ప్రగతి నిరోధక బడ్జెట్ అని భారత కార్మిక సంఘాల సమైఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఆరోపించారు. మంగళవారం సీపీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమ రంగాలకు కేటాయింపులు అరకొరగా ఉన్నాయని ఆయా రంగాలకు బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా వ్యయం ఉండటం లేదన్నారు. గత బడ్జెట్‌తో పోలిస్తే పారిశ్రామికరంగానికి నిధులు పెంచినా రెవెన్యూ లోటు తీవ్రత చూపించడం ఆందోళనకరమన్నారు. ఆశా, అంగన్‌వాడీ తదితర పథకాలను మాటలతో కాకుండా వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ప్రజా రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్న ఆర్టీసీకి తీవ్ర అన్యాయం చేశారని కేవలం రూ.1500 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు.

మత్స్యకారులకు తీవ్ర అన్యాయం..

చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేసిందని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ ఆరోపించారు. తెలంగాణలో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి మత్స్యకారుల సంక్షేమానికి రూ.5వేల కోట్లు కేటాయించాలని మత్స్య సొసైటీకి బ్యాంకు ఖాతాలో రూ.5 లక్షల నగదు జమచేయాలన్నారు.

బీసీల సంక్షేమానికి రూ. 20 వేల కోట్లకు పెంచాలి..

కాచిగూడ: బీసీల బడ్జెట్‌ను రూ.20 వేల కోట్లకు పెంచాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లాపెల్లి అంజి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 52 శాతం ఉన్న బీసీలకు కేవలం రూ.6వేల కోట్లు మాత్రమే కేటాయించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం తక్షణమే రూ.20వేల కోట్ల బడ్జెట్‌ను బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్స్ పెంచే ప్రస్తావనేలేదని పూర్తి రియంబర్స్‌మెంట్ ఊసేలేదన్నారు. విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేసే మాదిరిగా రాష్ట్ర బడ్జెట్ ఉందన్నారు. యూనివర్సిటీలకు నిధులు కేటాయించకపోవడం సిగ్గు చేటన్నారు. విద్యారంగానికి 10 శాతం నిధులు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం



గోల్నాక శాంతినగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అంబర్‌పేట: నియోజకవర్గంలో పైప్‌లైన్ వ్యవస్థ ఆధునీకరణకు చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. మంగళవారం గోల్నాక డివిజన్ శాంతినగర్‌లో రూ.6 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని బస్తీల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరాయంగా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జలమండలి అధికారులతో పాటు బీఆర్ఎస్ నాయకులు లింగంగౌడ్, బుచ్చిరెడ్డి, ఆర్.కె.బాబు, రాము, స్థానిక బస్తీ నాయకులు పాల్గొన్నారు.

'కేంద్రరాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం'



కాచిగూడ: కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగిందని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ విమర్శించారు. మంగళవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో 54 శాతం మంది ఉన్న బీసీలకు బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం నిధుల కేటాయింపు జరగలేదన్నారు. రూ.2.90 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.6,229 కోట్లు రూ. 45లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు కేవలంరూ.2వేల కోట్లను మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. బీసీలకు నిధుల కేటాయింపు పెంపు అంశాన్ని సీఎం కేసీఆర్ పరిశీలించాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్రం బీసీలకు బడ్జెట్ కేటాయింపులను రూ.2లక్షల కోట్లకు పెంచేలా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, డాక్టర్ కె.లక్ష్మణ్, బండిసంజయ్ ప్రధాని నరేంద్రమోదీతో మాట్లాడాలని కోరారు. బీసీ నేతలు పులిజాల కృష్ణ, పేరం నాగేశ్వర్‌రావు, భూషణ్ భాస్కర్, ప్రశాంత్ నిమ్‌కర్, ధీరేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

మడ్‌ఫోర్ట్ పాఠశాలలో అభివృద్ధి పనులు



రసూల్‌పురా: మన బస్తీ-మన బడిలో భాగంగా తిరుమలగిరి మండలం పరిధిలోని మడ్‌ఫోర్ట్ ప్రాథమిక పాఠశాలలో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు డిప్యూటీ డీఈవో బాలునాయక్ తెలిపారు. మంగళవారం బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్‌తో కలిసి పాఠశాలలో చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ.. పాఠశాల ప్రహరీ, టాయిలెట్స్ నిర్మాణ పనులు ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్నాయని కానీ.. తాగునీటి వసతి, మరమ్మతులు, విద్యుత్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రైవేటు కాంట్రాక్టర్లు చేపట్టేందుకు అవకాశం ఉందని ఈ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆశీర్వాదం, సుప్రద ఐరీన్, ఉపాధ్యాయులు షఢక్ పాల్గొన్నారు.